తెలంగాణ విమోచనం పేరుతో మోసం

- సాయుధ పోరాటానికి.. ఆర్ఎస్ఎస్, బిజెపికి ఏం సంబంధం?
- స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి తొత్తులు ఆర్ఎస్ఎస్
- భూస్వాములకు అండగా నాడు నైజాం, నేడు బిజెపి
- పెత్తందారులపై పోరాటాలకు సిద్ధం కావాలి : బివి రాఘవులు


బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధం లేని బిజెపి.. తెలంగాణ విమోచనం పేరుతో ప్రజలను మోసం చేస్తోందని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవం సందర్భంగా బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పిఎస్ఆర్ గార్డెన్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో బివి రాఘవులు పాల్గొని ప్రసంగించారు. సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ విమోచన దినోత్సవం గురించి ఆ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని వారు, అర్హత లేని వారు, వారసులమంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండాను ఎగురవేసి తమ పాలనలోనే నైజాం ప్రభుత్వం నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య ద్వారా తెలంగాణను విముక్తి చేశామని గొప్పగా చెప్పుకొంటున్నారన్నారు. ఎలాంటి సంబంధం లేని బిజెపి.. కేంద్రం నిధులతో విలీన దినోత్సవాన్ని జరుపుతోందన్నారు. అసలు తెలంగాణ సాయుధ పోరాటానికి..

ఈ రెండు పార్టీలకు ఎలాంటి సంబంధం లేదని, అసలైన వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టంచేశారు. దేశానికి 1947లో స్వాతంత్ర్యం వస్తే నైజాం ప్రభుత్వాన్ని కూల్చేందుకు 13 నెలలు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు.మతోన్మాద భావజాలంతో ముందుకు వస్తున్న బిజెపి తప్పుడు ప్రచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సాయుధ పోరాటానికి ఆర్ఎస్ఎస్, బిజెపిలకు ఏం సంబంధం..

తెలంగాణ సాయుధ పోరాటానికి బిజెపి, ఆర్ఎస్ఎస్‌కి ఏం సంబంధం అని బివి రాఘవులు ప్రశ్నించారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వాళ్లకు ఆర్ఎస్ఎస్ తొత్తుగా వ్యవహరించిందని గుర్తుచేశారు. వాస్తవానికి నైజాం, ఆర్ఎస్ఎస్‌కు అనేక విషయాల్లో పోలిక ఉందని, జాతీయోద్యమాన్ని కూడా వ్యతిరేకించారన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రజల్లో మత ఉద్రేకాన్ని సృష్టించి తమ ఎజెండాను అమలు చేసుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. అందుకే భాగంగానే ఈ పోరాటంతో ఏమాత్రం సంబంధంలేని వీరు.. పోరాట చరిత్రను మార్చే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. నాడు తెలంగాణ ప్రాంతంలో దొరలు, జాగిర్దారులు, పటేల్ పట్వారీలు.. ప్రజలను దోచుకు తినేవారని తెలిపారు. అంతేకాకుండా, నాటి నైజాం రజాకారు మూకలతో కుమ్మక్కయై ప్రజలను పట్టిపీడిస్తూ పన్నులను వసూలు చేయడమే కాకుండా వారి చేత వెట్టిచాకిరి చేయించారని గుర్తుచేశారు. దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరిచి దొరలు, జాగిర్దారులు, పటేల్, పట్వారీలకు, నైజాం రజాకార్ మూకలకు వ్యతిరేకంగా జరిపిన మహోన్నత పోరాటమే వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని తెలిపారు. వీరిలో హిందువులు, ముస్లిములు, ఇతర మతస్తులు కూడా ఉన్నారని అన్నారు. వారంతా తమ ఆధిపత్యాన్ని రక్షించేందుకు, అన్ని మతాల రైతాంగాన్ని, పేదలను దోపిడీ చేశారని చెప్పారు. వారికి వ్యతిరేకంగానే సాయుధపోరాటం జరిగిందని, ఈ పోరాటంలో అన్ని మతాల వారు, కులాల వారు ఉన్నారని అన్నారు. ఆ ఉమ్మడి మతసామరస్య వారసత్వాన్ని ఇప్పుడు బిజెపి తమ మతోన్మాద రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు దేశాన్ని ఒక మతరాజ్యంగా మార్చేయాలన్న కుట్ర జరుగుతుందన్నారు. ఇప్పటివరకు తన ప్రయత్నాలకు లొంగని తెలంగాణ రాష్ట్రాన్ని మత వైషమ్యాల పేరుతో విషపూరితం చేసేందుకు తెలంగాణ సాయుధ పోరాటాన్ని వాడుకునేందుకు మనం అనుమతించరాదన్నారు. వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటం మూలంగానే నైజాం ప్రభుత్వం లొంగిపోయిందని, ఇదే చారిత్రక వాస్తవమని స్పష్టంచేశారు.

నాటి నిజాంకు, బిజెపికి తేడా ఏం లేదు..!

అనేక విషయాల్లో ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి, ఆనాడు నైజాం సర్కార్‌లో అమలు చేసిన అంశాలు అవే రూపంలో అనుసరిస్తుందని బివి రాఘవులు విమర్శించారు. ఆనాడు నిజాం జమీందార్లను రక్షిస్తే, ఈనాడు బిజెపి పోరాటాల ద్వారా సాధించుకున్న భూములను రైతుల నుంచి గుంజుకుని కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగిస్తూ కార్పొరేట్ భూస్వాములను సృష్టిస్తుందన్నారు. ఆనాడు తెలుగును అణచివేసి నిజాం మాతృభాష అయిన పర్షియన్, ఉర్దూ భాషను ప్రజలపై రుద్దితే ఇప్పుడు బిజెపి హిందీ, సంస్కృతం భాషను దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన విషయమన్నారు. నాటి నైజాం పాలనలో వెట్టి చాకిరి పేరుతో కష్టజీవులు బానిసలుగా బతికారని, ఇప్పుడు బిజెపి పాలనలో మళ్లీ కొత్త రూపాల్లో వెట్టి చాకిరి పరిస్థితులను కండ్ల ముందు ఉంచుతుందన్నారు. 14 గంటల పని దినాలను సర్వత్ర అమలు చేయాలని ప్రయత్నాలు చేస్తుందని, కాంట్రాక్టు కార్మికులు, తాత్కాలిక పని అనే పేరుతో తీవ్ర శ్రమదోపిడికి పూనుకుంటుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ల పేరుతో కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలికే విధంగా చర్యలకు పూనుకుంటుందన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి నిజాం సర్కారుకు వారసులుగా ప్రకటించుకుని సంబరాలు జరుపుకుంటే సరిగ్గా సరిపోతుందని, కానీ ఎలాంటి నైతిక హక్కులు లేనప్పటికీ ఈ సంస్థలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని విమోచన దినంగా నిర్వహించడం సిగ్గుచేటన్నారు.

మతం పేరిట ప్రజల్లో ఐక్యతను చీల్చేందుకు బిజెపి కుట్ర : చుక్కరాములు

నాటి వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని రెండు మతాల మధ్యలో జరిగిన పోరాటంగా నేడు బిజెపి ప్రభుత్వం దాని అనుబంధ సంస్థలు ప్రకటించుకోవడం తెలంగాణ ప్రజలను మోసం చేయడమే తప్ప మరొకటి కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సోషల్ మీడియాలో తన మంద బలంతో అనేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఏమి చెప్పినా తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించి పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన, వేలాది గ్రామాలు దేశ్‌ముఖ్‌లు, రజాకార్లు, భూస్వాముల కబంధ హస్తాల నుంచి విడిపించిన చరిత్ర అంతా కమ్యూనిస్టులదేనని స్పష్టంచేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బిజెపికి చెందిన ఒక్క నాయకుడైనా, కార్యకర్త అయినా జైలుకు పోయిన చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు మల్లిఖార్జున్, జిల్లా కార్యదర్శి జి.జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మల్లేశం, కె.రాజయ్య, ఎ.మాణిక్, జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు, ప్రవీణ్ కుమార్, యాదగిరి, విద్యాసాగర్, కృష్ణ, నాయకులు పాండురంగారెడ్డి, బాగారెడ్డి, వాజిద్ అలీ, శ్రీనివాస్, పిఎస్ఎం జిల్లా కార్యదర్శి ఎ నాగభూషణం పాల్గొన్నారు.



పేదలకు భూములు పంచకుండా ప్రజాపాలన ఎలా సాధ్యం?

- పోరాటాలకు సిద్ధం కావాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఉన్న 25 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచకుండా 'ప్రజా పాలన' ఎలా సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. భూ పంపిణీ కోసం భవిష్యత్తులో సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని అన్నారు. నాడు నిజాం.. భూస్వాములు, పెత్తందారులు ఎలా అయితే దొరలకు వత్తాసు పలికారో, నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకు అలాగే ఊడిగం చేస్తోందని, ఇద్దరికీ తేడా ఏమీ లేదని అన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఫాతిమా హైస్కూల్ నుంచి విఆర్ఎన్ గార్డెన్ వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో జాన్‌వెస్లీ మాట్లాడారు. లదున్నేవాడిదే భూమి అనే నినాదంతో ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతాలని, నిలువ నీడ లేని పేదలు గుడిసెలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మానుకోటలో గుడిసెలు వేసుకున్న 5,000 మంది పేదలను పోలీసులు ఇరవైసార్లకు పైగా తరిమికొట్టారని, వారిపై అక్రమ కేసులు పెట్టారని సాదుల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్, అల్వాల వీరన్న, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, వన్‌టౌన్ కార్యదర్శి రావుల రాజు, టూటౌన్ కార్యదర్శి సమ్మెట రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో 1,743 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- అక్టోబర్ 8 నుంచి 28 వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)లో 1,743 పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీస్ నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో వెయ్యి డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ పోస్టులు ఉన్నాయి. అక్టోబరు ఎనిమిది నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35ఏండ్లు, శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30 ఏళ్ల వరకు వయోపరిమితిని నిర్ణయించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇడబ్ల్యుఎస్ కేటగిరి వారికి ఐదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు మూడేళ్లు వయో పరిమితి సడలింపు ఉంటుందని తెలంగాణ పోలీస్ నియామక మండలి తెలిపింది. స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. జిల్లాల వారీగా పోస్టుల వివరాలు, జీతభత్యాలను నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. పూర్తి వివరాలకు తెలంగాణ పోలీస్ నియామక మండలి అధికారిక వెబ్‌సైట్ ఇఇఇ.స్త్రజూతీఎ.ఱఅ లో సంప్రదించాలని పేర్కొన్నారు.



లాట్ మొబైల్స్‌ను ప్రారంభించిన నటి పాయల్ రాజ్ పుత్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

స్మార్ట్‌ఫోన్ రిటైల్ చెయిన్ లాట్ మొబైల్స్ ఒంగోల్‌లో ఏర్పాటు చేసిన రెండవ స్టోర్‌ను బుధవారం ప్రముఖ నటీ పాయల్ రాజ్‌పుత్ లాంచనంగా ప్రారంభించారు. అనంతరం స్టోర్‌లో ఆమె సందడి చేశారు. ఇక్కడ మొబైల్ ఫోన్లు, టివిలు, ల్యాప్‌టాప్‌లు, ఎసిలు, స్మార్ట్ గాడ్జెట్స్ కొనుగోలు చేసే వినియోగదారులు లక్కీడ్రాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు, వాషింగ్ మిషన్లు, రిఫ్రిజిరేటర్, ఎసి, స్మార్ట్ టివి, స్మార్ట్‌ఫోన్ గెలుచుకునే అవకాశం ఉందని ఆ సంస్థ డైరెక్టర్ ఎం సుప్రజ తెలిపారు. మొబైల్ కొనుగోలుపై గరిష్టంగా రూ.10వేల వరకు మొబైల్ ప్రొటెక్షన్ సహా 10 శాతం వరకు ఇన్‌స్టాంట్ క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చన్నారు.

మోడీకి సిఎం రేవంత్ జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎక్స్ వేదికగా సిఎం ట్వీట్ చేశారు. మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షుతో దేవుడు ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

హైదరాబాద్, వరంగల్‌లో ఐటి దాడులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో పలుచోట్ల ఐటీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 10, సికింద్రాబాద్‌లోని నగల దుకాణాల్లో తనిఖీలు చేశారు. వరంగల్‌లోనూ ఐటీ బృందాలు సోదాలు చేశాయి. బంగారం దుకాణదారులే లక్ష్యంగా తనిఖీలు చేసినట్లు తెలిసింది.మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులోని ఆచారీవీధిలో ఐటి అధికారులు సోదాలు చేశారు. జ్యువెలరీ దుకాణంలో రికార్డులను పరిశీలించారు. వ్యాపారి నివాసంలోనూ తనిఖీలు చేశారు. హైదరాబాద్‌లోని వాసవి రియల్ ఎస్టేట్ సంస్థలో ఐటి సోదాలు జరిగాయి. సంస్థ కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేశారు.

బిజెపికి సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో సంబంధమేంటి?

- పటేల్ కల 'ఆర్ఎస్ఎస్ లేని దేశం'
- చరిత్రను వక్రీకరిస్తే తరిమికొట్టడం ఖాయం
- తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఎస్ వీరయ్య



వార్షికత్సోవ సభలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వంలో హోంమంత్రిగా విధులు నిర్వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ కల 'ఆర్ఎస్ఎస్ లేని భారతదేశమ'ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య తెలిపారు. బిజెపికి, పటేల్‌కు సంబంధమేంటని ప్రశ్నించారు. హోంమంత్రిగా పటేల్ ఆర్ఎస్ఎస్‌ను నిషేధించారని గుర్తుచేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ మఖ్దూం మొయ్నుద్దీన్ విగ్రహం వద్ద సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో నగర కార్యదర్శి ఎం వెంకటేశ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ పోరాటంలో పాత్ర లేని ఆర్ఎస్ఎస్, బిజెపి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో దేశద్రోహుల సభ నిర్వహించారని విమర్శించారు. విమోచనమే జరిగితే నిజాం రాజును జైల్లో పెట్టకుండా రాజ్ ప్రముఖ్‌గా ఎందుకు ప్రకటించారనీ, ఖాసీం రజ్వీని రాచ మర్యాదలతో పాకిస్తాన్‌కు ఎలా పంపించారని ఆయన ప్రశ్నించారు. సెప్టెంబర్ 13న యూనియన్ సైన్యాలు రాకుంటే నిజాం రాజును, ఖాసీం రజ్వీని ప్రజలే ఉరి తీసేవారని తెలిపారు. సాయుధ పోరాటం చివరి దశలో షోలాపూర్ నుంచి వచ్చిన వారితో మరఠ్వాడలో హిందూ–ముస్లింల మధ్య మత ఘర్షణలు పెట్టేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నించిందని గుర్తుచేశారు. నాలుగు వేల మంది కార్యకర్తలు నేలకొరిగిన కమ్యూనిస్టులే సాయుధ పోరాటానికి వారసులని స్పష్టం చేశారు. నేపాల్ తదితర దేశాల్లో తిరుగుబాటు వచ్చినట్టే భారతదేశంలోనే వస్తుందనీ, ఆలస్యమైనా ప్రజలు నిజం గ్రహిస్తారని, ఆ రోజు దేశద్రోహులను తరిమికొట్టడం ఖాయమన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి మాట్లాడుతూ కులమతాలు, భాషాబేధాలు, ప్రాంతాలకతీతంగా నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నాడు పోరాటం జరిగిందని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో భాగస్వాములైన తెలంగాణ సాయుధ పోరాటం విజయం సాధించిందని తెలిపారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఊర్లో ఉత్సవానికి కుక్కల హడావుడీలా బిజెపి ఆర్భాటాలున్నాయని ఎద్దేవా చేశారు. ప్రపంచం గుర్తించిన పోరాటంపై బిజెపి చేస్తున్న వక్రీకరణలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షులు ఎం.వెంకటేశ్ మాట్లాడుతూ ఊడిగం చేసే పరిస్థితి నుంచి దున్నవారిదే భూమి అనే స్థాయికి ప్రజా పోరాటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డీ.జీ.నరసింహారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు, కెవెన్ రాజన్న, ఎం మహేందర్, నగర కమిటీ సభ్యులు వరలక్ష్మి, పద్మ, ఆర్ వెంకటేశ్, జె కుమారస్వామి, ఎన్ మారన్న పాల్గొన్నారు.

ఆర్ఎస్ బ్రదర్స్‌లో దసరా బ్లాక్‌బస్టర్ గిఫ్ట్స్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ రిటైల్ షాపింగ్‌ల్లో ఒక్కటైన ఆర్ఎస్ బ్రదర్స్ పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని 'దసరా బ్లాక్‌బస్టర్ స్పాట్ గిఫ్ట్స్' ఆఫర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. రూ.2,000 విలువ చేసే ప్రతీ కొనుగోలుపై విశేషమైన కానుకలను అందిస్తున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా రూ.4,495 విలువైన స్వర్ణ పట్టుచీరను కొనుగోలు చేసిన వారికి రూ.45లకే మరో చీరను కానుకగా అందిస్తున్నామని తెలిపింది. అదే విధంగా రూ.4,995 ఖరీదు చేసే పట్టు చీరను కొన్న వారికి మిక్సీగ్రైండర్‌ను కానుకగా ఇస్తున్నామని వెల్లడించింది. ఇతర వస్త్రాలను కొనుగోలు చేసే కొనుగోలుదారులకు తక్షణ కానుకలు అందించనున్నట్లు పేర్కొంది. దసరా వేడుకల కోసం పెద్ద ఎత్తున షాపింగ్ చేస్తున్న వారికి సరసమైన ధరలతో అద్భుతమైన ఆఫర్స్, స్పాట్‌గిఫ్ట్‌లు ఇస్తున్నట్లు తెలిపింది.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో సూపర్ ధమాకా ఆఫర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

పెళ్లిళ్ల సీజన్, విజయ దశమి వేడుకలను పురస్కరించుకుని సూపర్ ధమాకా ఆఫర్స్‌ను అందిస్తున్నట్లు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తెలిపింది. స్పాట్ గిఫ్ట్స్‌లో భాగంగా రూ.2,000 విలువ చేసే ప్రతీ కొనుగోలుపై అప్పటికప్పుడు అనేక రకాల కానుకలను అందిస్తున్నట్లు పేర్కొంది. రూ.4,335 విలువ చేసే కామాక్షి పట్టుచీరతో పాటు రూ.45లకే మరో చీర, రూ,4,995 విలువ చేసే పట్టుచీరతో పాటు మిక్సీ గ్రైండర్‌ను ఉచితంగా పొందవచ్చని ఆ సంస్థ వెల్లడించింది. అదే విధంగా లీడింగ్ బ్రాండ్స్‌పై స్పెషల్ కాంబో ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది.

పాత భవనాల పరిస్థితిపై నివేదిక సమర్పించాలి

- టిజిఎంఎస్‌ఐడిసి అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌లోని పాత భవనాల పరిస్థితిపై రెండు, మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని టిజిఎంఎస్‌ఐడిసి అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన ఉస్మానియా మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రులపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అనుబంధ ఆస్పత్రుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కు పూర్వ వైభవం తెచ్చేలా మౌలిక సదుపాయాల కల్పన, హెచ్‌ఆర్, పరికరాల మరమ్మతులు, ఆర్ఓ వాటర్ ప్లాంట్,

శానిటేషన్, డ్రయినేజీ సిస్టం, అంతర్గత రోడ్లు, రోగులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేయాలని మంత్రి ఆదేశించారు. రోగులకు అందుతున్న ఓపీ, ఐపీ సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. సరోజినీ దేవి కంటి హాస్పిటల్ మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేయాలన్నారు . ఓపీ, ఐపీ, ఎక్విప్‌మెంట్స్ రిపేర్లు, సాంకేతిక సిబ్బంది, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పాత భవనాల పరిస్థితిపై చర్చించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ, డిఎంఇ డాక్టర్ నరేందర్ కుమార్, ఉస్మానియా మెడికల్ కాలేజీ అనుబంధం ఆస్పత్రుల హెచ్ఓడిలు పాల్గొన్నారు.

మెరిల్ మిజ్జో ఎండో 4000 ఆవిష్కరణ

హైదరాబాద్ : భారతదేశములోని ప్రముఖ వైద్య పరికరాల కంపెనీలలో ఒకటైన మెరిల్ తన నెక్స్ట్ జనరేషన్ సాఫ్ట్ టిష్యూ సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ అయిన మిజ్జో ఎండో 4000ను ప్రారంభించినట్లు తెలిపింది. భారతదేశపు ఈ అధునాతన రోబోటిక్ శస్త్రచికిత్స ప్రపంచంలోనే కీలకంగా మారనుందని ఆ సంస్థ పేర్కొంది. సర్జన్లు అల్ట్రా ఫాస్ట్ కనెక్టివిటీ, అధునాతన రోబోటిక్స్, ఇమ్మర్సివ్ ఇమేజింగ్ ద్వారా సంక్లిష్టమైన విధానాలను రిమోట్‌గా, రియల్ టైమ్‌లో చేయగలుగుతారని మెరిల్ సిఇఒ వివేక్ షా పేర్కొన్నారు.

సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాల్సిందే

- విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ను సవరించాలి
- ప్రధాని, విద్యామంత్రికి ఎస్టీఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23ను సవరించాలని కోరింది. ఈ మేరకు న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ కార్యదర్శి కార్యాలయాల్లో ఎస్‌టిఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు సిఎన్ భారతి, ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి అబ్దుల్లా షఫీ కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఉద్యోగ విరమణ ఐదేండ్లకు మించి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులందరూ రెండేండ్లలో తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలనీ లేదా ఉద్యోగం నుండి రిటైర్ కావాలని సుప్రీంకోర్టు ఈనెల ఒకటో తేదీన ఇచ్చిన తీర్పు ఇచ్చిందని తెలిపారు. 2010, ఆగస్టు 23 కంటే ముందు దేశవ్యాప్తంగా నియామకమైన 25లక్షల మంది ఉపాధ్యాయులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 20, 25 ఏండ్ల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు తీర్పును పున్ణ సమీక్షించాలని కోరుతూ వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2010, ఆగస్టు 23 తర్వాత నియామక మైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్‌ను తప్పనిసరి చేస్తూ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23లో స్పష్టత ఇచ్చే విధంగా ఆ చట్టాన్ని సవరించాలని కోరారు. గత 15 ఏళ్లుగా ఎన్‌సిటిఇ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా హక్కు చట్టం అమలుకు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ అవసరమంటూ చెప్పలేదని తెలిపారు. పైగా 2010, ఆగస్టు 23కి ముందు నియామకమైన వారికి టెట్ మినహాయింపు ఇచ్చినట్టు కొన్నిరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయని గుర్తు చేశారు. అందుకే సీనియర్ టీచర్లు ఇప్పటివరకు టెట్ ఉత్తీర్ణులు కావాలనే ఆలోచన చేయలేదని తెలిపారు. సుప్రీంకోర్టు సివిల్ అప్పీల్ నెంబరు 1385/2025 కేసులో ఈనెల ఒకటో తేదీన ఇచ్చిన తీర్పు వారి ఉద్యోగాలకు ముప్పు తెచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వారి ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

టెట్ ఉత్తీర్ణత మార్కులను 50 శాతానికి సవరించాలి

టెట్ సిలబస్‌ను మార్చాలనీ, ఉత్తీర్ణత మార్కులను 60 శాతం నుంచి 50 శాతానికి సవరించాలని ఎస్టీఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిఎన్ భారతి, చావ రవి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సిటిఇ) చైర్మన్ పంకజ్ అరోరా, కార్యదర్శి అభిలాష మిశ్రాలను బుధవారం న్యూఢిల్లీలో వారు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు సుప్రీంకోర్టును సందర్శించి సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపారు. ఎస్టీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెలాఖరులోగా రివ్యూ పిటిషన్ వేయటానికి

పికెట్ పార్కులో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

- రిమోట్ ద్వారా ఆవిష్కరించిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ పికెట్ పార్కులో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని బుధవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆవిష్కరించారు. రాజ్‌నాథ్ సింగ్ రిమోట్ ద్వారా విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రక్షణ శాఖ మంత్రి, ఇతర మంత్రులకు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు నర్మదా మల్లికార్జున్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షేకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పికెట్ వద్ద భారీ బందోబస్తు.. మీడియాకు నో ఎంట్రీ

కేంద్ర మంత్రి రాక సందర్భంగా పోలీసులు పికెట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మీడియా సహా సాధారణ నాయకులను లోపలికి అనుమతించలేదు. కేవలం వీఐపీలకే ప్రవేశం కల్పించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తన అనుచరులతో కలిసి రాగా.. పోలీసులు ఆపేశారు. ఎమ్మెల్యే లోపలికి వెళ్లగా.. ఆయన అనుచరులు వెనుదిరిగారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

పలు సమస్యలపై కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సభ్యులు నళిని వెంకట్రావు, అనిత ప్రభాకర్, పాండు యాదవ్ తదితరులు అక్కడకు చేరుకోగా పోలీసులు లోపలికి అనుమతించలేదు. దాంతో కంటోన్మెంట్ బోర్డు అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని ఆరోపిస్తూ వారు ఆందోళన చేపట్టారు. కార్యక్రమం ముగిసిన తర్వాత వాజ్‌పేయి విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. బోర్డు సిఇఒ మధుకర్ నాయక్‌ను నిలదీశారు. అందుకు ఆయన క్షమాపణ చెప్పారు.


సిఎం ఫొటోను గోడకు తగలిస్తున్న వేణారెడ్డి

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్యాంపు ఆఫీసులో సిఎం, మంత్రి ఫొటోలు

- ఫొటోలు తొలగిస్తే ఇంటిని ముట్టడిస్తాం
- సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి బుధవారం కాంగ్రెస్ కార్యకర్తలు, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి వచ్చి సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను గోడకు తగలించారు. ఈ సందర్భంగా వేణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీ ఆఫీసుగా మార్చడం ప్రజాస్వామ్యానికి అవమానం అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫొటోలు పెట్టకపోవడం విచారకరన్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆదేశాల మేరకే సిఎం, జిల్లా మంత్రి ఫొటోలు పెట్టామని తెలిపారు. తాము పెట్టిన ఫొటోలను ఎవరైనా తొలగిస్తే జగదీశ్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిమెంట్ ధరలను తగ్గిస్తాము

- భారతీ సిమెంట్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

సిమెంట్ ధరలను తగ్గిస్తామని భారతీ సిమెంట్ కార్పొరేషన్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సిమెంట్‌పై జిఎస్‌టిని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు.

సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న కొత్త జిఎస్‌టి విధానం లక్షలాది మంది గృహనిర్మాణదారులు, మౌలిక సదుపాయాల డెవలపర్లు, సాధారణ పౌరులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. జిఎస్‌టి తగ్గింపు పూర్తి ప్రయోజనాన్ని వినియోగదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు.



తనైరా నుంచి మియారా కలెక్షన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్

టాటా గ్రూపునకు చెందిన మహిళల ఎత్నిక్ వస్త్రాల బ్రాండ్ అయిన తనైరా తమ పండుగ కలెక్షన్ 'మియారా: క్రాఫ్టెడ్ బై హ్యాండ్, రూటెడ్ ఇన్ ప్యూరిటీ'ని విడుదల చేసింది. నేటి మహిళల కోసం చేతితో తయారు చేసిన ఈ శ్రేణిని బుధవారం హైదరాబాద్‌లో తనైరా సిఎస్ఎంఒ సోం ప్రభ్ సింగ్ ఆవిష్కరించారు.

"ఈ సీజన్‌లో, వైవిధ్యమైన వస్త్రాలలో వ్యక్తీకరించబడిన ఊహ, వారసత్వ ప్రతిబింబంగా మేము మియారాను ఆవిష్కరిస్తున్నాము. తనైరా వద్ద మేము చీరను కేవలం ధరించడం కాదు.. అనుభవించదగినది అని నమ్ముతాము." అని ప్రభ్ సింగ్ పేర్కొన్నారు. మియారా కలెక్షన్ రూ.6,499 నుండి ప్రారంభమవుతుందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం

- భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడలు మేళవింపుతో ఉండాలి
- విద్యా రంగం సమూల ప్రక్షాళనే మా ధ్యేయం
- సిలబస్, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరం..
- తెలంగాణ విద్యా విధానంపై సమావేశంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదని... జ్ఞానం ఉన్న చోట భాష లేదని.. రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవని.. కానీ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలని సిఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై తెలంగాణ సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు సిఎం తెలిపారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం... నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని... ఇప్పుడు పంపకానికి భూములు, తగినన్ని నిధులు లేవన్నారు. ఇప్పుడు పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగం ప్రాధాన్యతను గుర్తించినందునే ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సిఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆస్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణంగా ఇంజనీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్‌వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సిఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సిఎం తెలిపారు. విద్యా రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ఏటికేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్‌కెజి, యుకెజితో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. నర్సరీకి ప్రైవేటు పాఠశాలలో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడడం లేదన్నారు. విద్యార్థుల రాకపోకలు, తగిన శ్రద్ధ చూపుతారనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని సిఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ఆ రకమైన ధీమా కల్పించగలిగితే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చుతారని.. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సిఎం సూచించారు.

విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులు ఉండాలనే ఉద్దేశంతో తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టేలా వారికి ప్రమోషన్లు, బదిలీలు చేశామన్నారు. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం చేపట్టామని సీఎం తెలిపారు. ఉస్మానియా, కాకతీయ విశ్వ విద్యాలయాలు గతంలో సైద్ధాంతిక భావజాలలకు నిలయంగా నిలిచి ప్రజా సమస్యలపై ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టేవని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వ విద్యాలయాల స్థాయి వరకు విద్యా ప్రమాణాలు పడిపోవడం.. నైపుణ్యాల లేమితో ఉద్యోగాలు లభించకపోవడంతో విద్యార్థులు డ్రగ్స్ బారినపడి జీవితాలను కోల్పోతున్నారని సీఎం అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సులను అందించేందుకు ఐటీఐల్లో కోర్సులను మార్చామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ఇప్పటి వరకు విద్యా రంగంపై తాము చేసిన కృషితోనే తాము సంతృప్తి చెందడం లేదని.. ప్రాథమిక దశ నుంచి యూనివర్సిటీల వరకు సమూల ప్రక్షాళన చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని సీఎం అన్నారు. డిసెంబరు 9వ తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని సీఎం వెల్లడించారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకొని ఇందులో ఉన్న విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలని సీఎం కోరారు.

విద్యా వ్యవస్థ వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం కాకుండా నిరుపేదలకు లబ్ధికలిగేలా ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నామని సీఎం తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల పేరిట విద్యార్థులను చిన్నతనం నుంచే వేరు చేస్తున్నామని... దానిని రూపుమాపి అంతా ఒకటే అనే భావన కలిగించేలా విద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని సీఎం అన్నారు. మీరు రూపొందించే తెలంగాణ విద్యా విధానం దేశానికి దిక్సూచిలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి విద్యా వేత్తలను ఉద్దేశించి అన్నారు. ఆశించిన స్థాయిలో తెలంగాణ విద్యా విధానం అమలయ్యేందుకు వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం తీసుకోవాలని సీఎం సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్రంగా వినియోగించుకునేలా విద్యా విధానం ఉండాలన్నారు.

విద్యా విధానంపై ఎంత వ్యయానికైనా తాము వెనుకాడమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు, ప్రమాణాల మెరుగుకు ఖర్చు చేయాలని నిర్ణయించామని తెలిపారు. విద్యపై చేసే వ్యయాన్ని వ్యయంగా కాక పెట్టుబడిగా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు. విద్యాభివద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరామని సీఎం తెలిపారు. తెలంగాణ విద్యా విధానంలో సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరమని సీఎం పేర్కొన్నారు.

తెలంగాణ విద్యా విధానం ఛైర్మన్ కేశవరావు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి , ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పలు సూచనలు చేశారు. సిఎస్ .రామకష్ణారావు, ఎమ్మెల్సీలు ఏ.వి.ఎన్.రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, విద్యావేత్తలు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


వెంచర్ ఏర్పాటు చేసుకున్న వాగులు, కాలువలు

సదాశివపేటలో ఈదులవాగు కబ్జా

- నాలుగు కాలువల ఆక్రమణ
- ఇరిగేషన్ అధికారుల అండదండలు
- శ్రీనిధి నియోసిటీ పేరుతో వెంచర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారుల సాక్షిగా వాగులు, కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. కబ్జాదారులకు ఎన్ఒసిలు సైతం జారీ అయ్యాయి. తాత్కాలిక డిటిసిపితో పనులు కానిస్తూ.. వెంచర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ వ్యవహారమంతా తెలిసినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్టు ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో శ్రీనిధి నియోసిటీ పేరుతో ఓ వెంచర్ యథేచ్ఛగా ఈదులవాగు చుట్టూ నిర్మాణాలు చేపట్టింది. దాంతోపాటు ఈదులవాగును ఆక్రమించారన్న ఫిర్యాదులు అధికారులకు అందాయి. మరో నాలుగు కాలువలను సైతం ఆక్రమించి పూర్తిగా మట్టితో పూడ్చివేశారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈదులవాగును, ఆ వెంచర్ నుంచి ప్రవహిస్తున్న నాలుగు కాలువలకు ఇరిగేషన్ అధికారులు ఎన్ఒసిలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో వాగులు, వంకలు, చివరికి మంజీర నది కూడా ఆక్రమణకు గురైంది. దీనికంతటికీ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదాశివపేట పట్టణ పరిధిలో ఏర్పాటు చేస్తున్న శ్రీనిధి వెంచర్ 99 ఎకరాల్లో ఉంది. ఆ వెంచర్ నుంచి వెళ్తున్న ఈదులవాగును ఇరిగేషన్ శాఖ అధికారులు ఇచ్చిన జీవోతో ఆక్రమించినట్టు తెలిసింది. నాలుగు చిన్న కాలువలను మట్టితో పూడ్చేసి వెంచర్‌లో కలిపేసుకున్నారు. వాగుపై వంతెనలు నిర్మించి వాగు విస్తీర్ణాన్ని కుదించారు. ఆక్రమించిన కాలువలు, వాగును పూడ్చివేసి రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

తాత్కాలిక డీటీసీపీతో పనులు..

శ్రీనిధి వెంచర్‌కు డిటిసిపి నుంచి పూర్తి అనుమతులు లేవు. ఈ వెంచర్ నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు అండదండలు అందిస్తున్నారు. వెంచర్ యాజమాన్యం అన్ని అనుమతులు తీసుకుందంటూ తప్పుడు ప్రచారానికి తెరలేపారు. వ్యవసాయ భూములకు కన్వర్షన్ లేదు. ఎల్‌పి నంబర్, రేరా లేకుండా వెంచర్ నిర్మాణం సాగుతోంది.

అనుమతులు లేకుండానే రిజిస్ట్రేషన్లు..

ఎలాంటి అనుమతులూ లేకుండానే వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు అందులో ప్లాట్ల విక్రయాలు చేపట్టారు. మున్సిపల్ అధికారులకు వెంచర్ బోర్డులు, రిజిస్ట్రేషన్లు, ప్రచారాలు కనిపించడం లేదు. అక్రమంగా ఏర్పాటు చేస్తున్న శ్రీనిధి నియోసిటీ వెంచర్‌కు ప్రజాప్రతినిధులు ఓ వైపు సహకారం అందిస్తుంటే, అధికారులు మరోవైపు సహకరిస్తూ ఆక్రమణదారులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎవరికి కావాల్సింది వారు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని ఈదులవాగు, నాలుగు కాలువలను కాపాడాలని పేట వాసులు కోరుతున్నారు.

ఈదులవాగు సర్వే చేస్తాం.. ఇరిగేషన్ డిఇ బాలగణేష్

వాగు ఆక్రమణ జరిగినట్టు మా దృష్టికి రాలేదు. శ్రీనిధి వెంచర్ నుంచి వెళ్తున్న ఈదులవాగును సర్వే చేస్తాం. వాగు విస్తీర్ణం, వైశాల్యం నిర్ధారించి ఆక్రమణ జరిగితే చర్యలు తీసుకుంటాం. వాగు విస్తీర్ణంతోపాటు ఎఫ్‌టీఎల్ కూడా ఉంటుంది. దానిని నిర్ధారించి ఎంత మేర వాగు ఉందో గుర్తించి.. ఆక్రమణకు గురైనట్టు తేలితే వెంచర్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం.

త్రిబుల్ ఆర్ నూతన అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

- అఖిలపక్షం ఆధ్వర్యంలో సాగర్ హైవే దిగ్బంధానికి యత్నం
- భారీగా పోలీసుల మోహరింపు.. తోపులాట.. నాయకుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్రిబుల్ ఆర్ రోడ్డు నూతన అలైన్‌మెంట్‌పై భూబాధిత రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా నాయకుల కోసమే ప్రభుత్వం కొత్త అలైన్‌మెంట్ తీసుకొచ్చిందని.. దాన్ని వెంటనే మార్చాలంటూ బుధవారం రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అన్నెబోయినపల్లి గేటు వద్ద సాగర్‌హైవేను రైతులు, అఖిలపక్ష నాయకులు దిగ్బంధించేందుకు యత్నించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, స్పెషల్ ఫోర్స్, పోలీసులు మోహరించి ర్యాలీగా వస్తున్న రైతులను, రైతు సంఘం నాయకులను, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను అడ్డుకున్నారు. దీంతో రైతులు ఆగ్రహంతో 'ముఖ్యమంత్రి డౌన్‌డౌన్, ఎమ్మెల్యే డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. తమ భూములు లాక్కోవద్దంటూ.. త్రిబుల్ ఆర్ అలైన్‌మెట్ మార్చడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. పోలీసులను తోచుకుంటూ.. భారీ గేట్లను దాటి పరిగెత్తి రైతులు సాగర్ హైవేపై బైటాయించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చి రైతుల నోట్లో మట్టి కొట్టిందని విమర్శించారు. బడానాయకుల భూములను కాపాడి, నిరుపేదల భూములను లాక్కునేలా అలైన్‌మెంట్ ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

కొత్త అలైన్‌మెంట్‌ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

రైతు సంఘం రాష్ట్రం పగడాల యాదయ్య

రీజినల్ రింగ్ రోడ్ కొత్త అలైన్‌మెంట్‌ని తక్షణమే మార్చాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. వందల ఎకరాలున్న భూస్వాముల భూములను కాపాడటం కోసం పేద, సన్న, చిన్నకారు రైతుల భూములను రీజినల్ రింగ్ రోడ్డు పేరుతో గుంజుకోవడం దౌర్జన్యమన్నారు. 2013 భూ సేకరణ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా మొదట ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో భూ నిర్వాసితులను ఏకం చేసి రాబోయే కాలంలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్, పగడాల యాదయ్యతోపాటు రైతు సంఘం నాయకులను, రైతులను పోలీసులు అరెస్టు చేసి యాచారం పిఎస్‌కు తరలించారు. ఈ ధర్నాలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బాక రామచందర్, ఉపాధ్యక్షులు కానుగుల వెంకటయ్య, భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు దొడ్డి పరమేష్, ప్రజా సంఘాల నాయకులు కందుకూరి జగన్, పెరుమల్ల అంజయ్య, పిప్పళ్ళ శివశంకర్, కుర్మయ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి, లక్ష్మీ నరసింహ్మారెడ్డి, రెడ్డి కృష్ణారెడ్డి, జంగయ్యగౌడ్, తిరుమల్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, రమేష్‌రెడ్డి, గ్యార చంటిబాబు, గౌనిలాలయ గౌడ్, కోరుకోరు తిరుపతయ్య, యాదిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆమనగంటి రామిరెడ్డి, నారకట్ల వెంకటయ్య, చంద్రయ్యగౌడ్, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.


రోడ్డు బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను రద్దు చేయాలి

'త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను రద్దు చేయాలి.. ఉన్న రోడ్లు చాలయ్యా.. కొత్త రోడ్లు వద్దయ్యా' అంటూ భూనిర్వాసిత రైతులు నినదించారు. పుట్టపాక, సర్వేలు, లింగారెడ్డిగూడెం, చిమిర్యాల, గుడిమల్కాపురం గ్రామాల రైతులు బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుడిమల్కాపురం వద్ద రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్ల దూరంలో నిర్మించాల్సిన త్రిబుల్‌ఆర్‌ను చౌటుప్పల్‌లోని దివిస్ కంపెనీ, కొంతమంది పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 28, 30 కిలోమీటర్ల లోపు నిర్మించేందుకు అలైన్‌మెంట్‌ను మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలైనా అడ్డు పెడతాం.. మా భూములను వదలం అని స్పష్టం చేశారు. రైతులకు సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. కలిసికట్టుగా ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాస్తారోకోలో పల్లె పుష్పారెడ్డి, బద్దుల వెంకటయ్య, గుండె మల్లేష్, నాగార్జున, నెల్లికంటి రాములు పాల్గొన్నారు.

అది 'మోడీ, అమిత్ షాల బిజెపి'

- దానికి గతం తెలియదు... అందుకే చరిత్రను వక్రీకరిస్తున్నారు
- తెలంగాణ విలీన దినోత్సవంలో మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల చరిత్ర బిజెపి నేతలకు తెలియదని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. అది మోడీ, అమిత్‌షాల బిజెపి, అందుకే వారు గత చరిత్రను తెలుసుకోరని ఎద్దేవా చేశారు. అజ్ఞానంతోనే తెలంగాణ పోరాటాల చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే వారికి దేవుడని చెప్పారు. వారికి దేశభక్తి కంటే అధికార భక్తి ఎక్కువ అని విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆదేశాలతో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో 'ఆపరేషన్ పోలో' పేరిట హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసినట్టు గుర్తు చేశారు. అది ముమ్మాటికీ విలీనమేనని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన తెలంగాణ విలీన దితన్సోవంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేయడంలో కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను స్మరించుకోవాల్సిన అవసరముందని చెప్పారు. అందుకోసం రామనంద తీర్థ, జమాలపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పీవీ నరసింహరావు వంటి మహనీయులను గుర్తు చేసుకోవాలన్నారు. నిజాం వ్యతిరేకంగా పోరాడిన కుమురంభీమ్, దొడ్డి కొమురయ్య, వీరనారి ఐలమ్మ, షేక్ బందగి, కమ్యూనిస్టు యోధులను స్మరించుకోవడమనేది ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అని చెప్పారు. 1980లో ఆవిర్భావించిన బిజెపికి...దేశ స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ విలీన పోరాటాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. గాంధీని గౌరవించకుండా ఆయన్ను హత్య చేసిన గాడ్సేను పూజించడం అది దేశ భక్తి కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అద్భుతమైన ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం నుంచి సన్నబియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు

మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.



రాజేంద్ర ప్రసాద్ వంశీ రామరాజుల స్నేహబంధం ఉన్నతం

ప్రజాశక్తి - కల్చరల్

నటుడు రాజేంద్ర ప్రసాద్, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజుల స్నేహ బంధం ఉన్నతం అని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. వంశీ రామరాజు జన్మదినం సందర్భంగా ఆయనకు స్వర్ణ కంకణ బహుకరణ రావడం, లగ్గము సినిమాలో ఉత్తమ నటనకి వంశీ ఆర్ట్స్ ప్రెస్టేజ్ అవార్డును ఇదే వేదికపై అందుకోవడం ఇందుకు నిదర్శనం అన్నారు శ్రీ త్యాగరాయ గాన సభ మెయిన్ హాల్‌లో వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఇంటర్నేషనల్ శ్రీ కష్ణ స్వర రాగ స్రవంతి నిర్వహణలో వంశీ రామరాజు 75 వ జన్మ దినోత్సవం సందర్భంగా ఆయనకు స్వర్ణ కంకణ బహుకరణ, రాజేంద్ర ప్రసాద్ కు వంశీ ఆర్ట్స్ ప్రెస్టేజ్ అవార్డ్ ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ వారిని సత్కరించి మాట్లాడారు. కళారాధన సామాజిక సేవారాధన వంశీ రామరాజు జీవనం అని ప్రశంసించారు హాస్యాన్ని కథా నాయకుడు స్థాయికి చేర్చిన రాజేంద్ర ప్రసాద్ 48 ఏళ్లుగా ప్రజల అభిమానం సంపాదించుకున్నారు అని కొనియాడారు అధ్యక్షత వహించిన ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ లగ్గము సినిమాలో రాజేంద్ర ప్రసాద్ నటన మరవలేనిదని అభినందించారు రాజేంద్ర ప్రసాద్ స్పందనలో హాస్యం పండించడం సులువు కాదని తనను ఇంతకాలం ఆదరిస్తున్న ప్రజలుకి ధన్యవాదాలు అన్నారు. వై ఎస్ రామకృష్ణ. బృందం పాడిన పాటలు మధురం తెన్నేటి సుధ, సుధా మయి శైలజ పాల్గొన్నారు.

హైడ్రాలో వేతనాలు తగ్గడం లేదు

- సర్దుబాటు చర్యల్లో జాప్యం వల్లే ఆందోళన
- కమిషనర్ హామీతో విధులకు హాజరైన ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైడ్రాలో అవుట్‌సోర్సింగ్ (ఒప్పంద కార్మికులు) ద్వారా పని చేస్తున్న ఉద్యోగుల వేతనాలు ఏమీ తగ్గడం లేదని బుధవారం హైడ్రా స్పష్టం చేసింది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 1272 ప్రకారం జిహెచ్ఎంసిలోని ఇవిడిఎం ద్వారా హైడ్రాకు సమకూరిన ఉద్యోగుల వేతనాలు రాష్ట్రంలోని వేరే డిపార్ట్‌మెంట్స్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సమానంగా సవరించడం జరిగింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి హైడ్రా తీసుకెళ్లింది. ఆ వ్యత్యాసం మొత్తాన్ని జిహెచ్ఎంసి నుంచి మ్యాచింగ్ గ్రాంట్‌గా అందజేయాలని ప్రభుత్వం సూచించింది. ఆ మ్యాచింగ్ ఫండ్‌తో మొత్తం వేతనం చెల్లించడానికి హైడ్రా ప్రయత్నించింది. అయితే ఆ మ్యాచింగ్ ఫండ్ రావడం ఆలస్యం అయ్యింది. స్టాండింగ్ కమిటీ ఆమోదం తర్వాత మ్యాచింగ్ ఫండ్ విడుదల చేస్తామని జిహెచ్ఎంసి తెలిపింది. ఉద్యోగులు వేతనాలు లేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో జిఒ 1272 ప్రకారం వెంటనే హైడ్రా చెల్లించింది. వ్యత్యాసం మొత్తాన్ని త్వరలో సర్దుబాటు చేస్తామని కూడా చెప్పింది. అయితే కొంతమంది ఉద్యోగులు వేతనాలు తగ్గినట్టు భావించి బుధవారం ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఉద్యోగులతో హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ చర్చలు జరిపారు.

ఒకే రోజు 980 ఆర్టిఐ కేసుల విచారణ

- అన్నింటి ఫిర్యాదుదారుడు ఒక్కరే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని తెలంగాణ సమాచార శాఖ కమిషన్ భవన్‌లో గురువారం ఒకే రోజు 980 కేసులను విచారించనున్నారు. ఈ మేరకు ఫిర్యాదుదారుడికి సమాచార కమిషన్ నోటీసులు పంపింది. ఈ కేసులన్నీ కూడా ఒకే ఫిర్యాదుదారుడికి చెందినవి కావడం గమనార్హం. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సమాచార హక్కు చట్టం కార్యకర్త మహ్మాద్ అష్రఫ్ పలు ప్రభుత్వ శాఖలలో సమాచారం కోసం దరఖాస్తు చేశాడు. సకాలంలో ఆయా శాఖల అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో మహ్మాద్ అష్రఫ్ సమాచార కమిషన్‌లో అప్పీలు చేశాడు. మొదటి అప్పీలుపై సంబంధిత శాఖ అధికారులు స్పందించలేదు. దీనితో రెండో అప్పీలును సమాచార కమిషనర్‌కు చేశాడు. మహ్మాద్ అష్రఫ్ నుంచి ఒత్తిడి రావడం, ఇతని అప్పీళ్ల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో సమాచార కమిషన్ వీటన్నింటినీ ఒకే రోజు విచారించి పరిస్కరించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అష్రఫ్ అప్పీలు చేసిన కేసులన్నీ మొత్తం 980 ఉన్నట్టు తేలింది. ఇందులో హోంశాఖకు చెందినవి 218, రెవెన్యూ 259, విద్యాశాఖ 231, జనరల్ అడ్మినిస్ట్రేషన్ 28, ఉన్నత విద్యాశాఖ 40, మైనార్టీ 50, వ్యవసాయ శాఖ 31, పంచాయతీరాజ్ 32, మున్సిపల్ 16, గిరిజన శాఖ 44, రవాణా శాఖ నాలుగు, ఫైనాన్స్ ఆరు, ఆరోగ్య శాఖ ఆరు, పర్యావరణ శాఖ రెండు, ఎనర్జీ శాఖకు సంబంధించిన ఒక కేసు ఉంది. వీటన్నింటినీ ఒకే రోజు విచారించి ఫిర్యాదుదారునికి సాంత్వన చేకూర్చేందుకు తెలంగాణ సమాచార కమిషన్ నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

ఈ విచారణ న్యాయబద్ధం కాదు : మహ్మాద్ అష్రఫ్

ఒకే రోజు 980 కేసుల విచారణ అనేది న్యాయబద్ధం కాదని సహ చట్టం కార్యకర్త మహ్మాద్ అష్రఫ్ అన్నారు. తూతూ మంత్రంగా ఈ విచారణ చేపట్టేందుకు అధికారులు నిర్ణయించినట్టుగా ఉందని విమర్శించారు. తాను అడిగిన సమాచారాన్ని సకాలంలో ఎందుకు ఇవ్వలేదనే విషయంలో సమాచార కమిషన్ విచారించాల్సి ఉంటుందని, ఇంత స్వల్ప వ్యవధిలో ఇన్ని కేసుల విచారణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు ఇచ్చిన ఆదేశాలకు, సమాచార హక్కు చట్టంలో పేర్కొన్న నిబంధనావళికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, సంబంధిత శాఖ పీఐఓ, అప్పిలేట్ అథారిటీలను పిలువకుండా విచారణ చేయడం చట్టవిరుద్ధమని అన్నారు. పూర్తి స్థాయిలో వాదనలు వినకుండా సమాచార కమిషన్ ఎలా తీర్పు ఇస్తుందని ప్రశ్నించారు.

ఫుల్ బెంచ్ ద్వారా విచారణ : నయీమొద్దీన్

ఒకే రోజు 980 కేసులను ఫుల్ బెంచ్ ద్వారా విచారణ చేపట్టనున్నట్టు కమిషనర్ పర్సనల్ సెక్రటరీ నయీమొద్దీన్ తెలిపారు. ఈ కేసుల విచారణకు చీఫ్ కమిషనర్‌తో పాటు ఐదుగురు కమిషనర్‌లు హాజరు కానున్నారని, అందరూ కలిసి ఈ కేసులను విచారిస్తారని తెలిపారు.